క్లుప్తంగా

విద్యా వ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీరామమూర్తి

జి.సిగడాం: జగనన్న హయాంలో విద్యారంగానికి పెద్దపీట వేస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవస్థను నిర్వీర్యం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి ధ్వజమెత్తారు. మంగళవారం దవళపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎప్పటిలోగా సూపర్‌సిక్స్ హామీలు అన్నీ అమలు చేస్తారో ప్రజలు సమాధానం చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక్క సామాజిక పింఛన్ కూడా మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కోశాధికారి తంగుడు నాగేశ్వరరావు, పేడాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు బాగు చేయిస్తున్న సర్పంచ్

జి.సిగడాం: వేసవి నేపథ్యంలో పాడైన బోర్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నట్లు చెట్టుపొదిలాం సర్పంచ్ భూపతి సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం గ్రామ పరిధిలోని తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో భూపతి బుజ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాంలో తాగునీటి బోరుకు పంచాయతీ కార్యదర్శి తేజ మరమ్మతులు చేయించారు. ప్రజల తాగునీటి అవసరాల దృష్ట్యా మండల పరిషత్ నిధుల నుంచి పరికరాలు సమకూర్చి బోరు బాగు చేయించినట్లు తెలిపారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని నక్కవీధిలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం వేడుకలు బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మూలవిరాట్టుకు అభిషేకాలు, పుష్పార్చనలు, సాయంత్రం కల్యాణోత్సవం జరుగుతాయని, భక్తులంతా పాల్గొనాలని కోరారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చలివేంద్రం



తాగునీరు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ హనుమంతు అమరసింహుడు అన్నారు. కాంప్లెక్స్ ఆవరణలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్ఎం ఎంపీ రావు, టీఐ-2 ఎం.హాటకేశ్వరరావు, విశ్రాంత ఆర్టీసీ అధికారులు బీఎల్‌పీ రావు, ఎండీఏ బాషా తదితరులు పాల్గొన్నారు.

కరస్రాముకు పూర్వవైభవం



క్రీడాకారులను అభినందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అంతరించిపోతున్న ప్రాచీన క్రీడ కర్రసాముకు పూర్వవైభవం తీసుకురావాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ సౌజన్యంతో కర్రసాము క్రీడాకారులకు మంగళవారం కళాశాల ఆవరణలో ఆర్థిక సహాయాన్ని అందించారు. జిల్లాలో కర్రసాము క్రీడకు ప్రాణం పోస్తున్న యువ క్రీడాకారుడు, కోచ్ బలగ హర్షవర్ధన్‌ను అభినందించారు. ఈ నెల 30వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా కైకలూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కర్రసాము క్రీడాపోటీలకు వెళ్తున్న బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తీత



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా మేజర్, మీడియం కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు తెలిపారు. నగర పరిధిలోని పలు కాలువల్లో మంగళవారం పూడికలు తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చెత్తను చెత్త సేకరణ వాహనాలు, డబ్బాల్లో మాత్రమే వేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కాలువల్లో వేయకూడదని చెప్పారు. కమిషనర్‌తో పాటు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌కుమార్ ఉన్నారు.

పెచ్చులూడుతున్నా.. పట్టించుకోరా?



రికార్డు గదిలో పెచ్చులూడి కిందపడిన దృశ్యం

- అధ్వానంగా మున్సిపల్ కార్యాలయ రికార్డుల గది
- భయంభయంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేయని వైనం

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అత్యంత కీలకమైన రికార్డుల గది పెచ్చులూడుతోంది. దీంతో విలువైన దస్త్రాలకు రక్షణ లేకుండాపోతోంది. నగర ప్రజలకు సంబంధించిన పూర్తి వివరాలు దాదాపుగా ఇదే కార్యాలయంలో నిక్షిప్తమై ఉంటాయి. అంతేకాకుండా కార్పొరేషన్ అభివృద్ధికి సంబంధించిన ఖర్చులు, రాబడి, పన్నుల వసూళ్లు, పుట్టిన, మరణించిన వారి దస్త్రాలు సైతం ఈ కార్యాలయంలోనే భద్రపరిచి ఉంటాయి. కార్పొరేషన్ పరిధిలో ఇంటి నిర్మాణాలకు సంబంధించిన ప్లాన్ కాపీలు, చలానాలు, ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లతో పాటు అనేక విలువైన రికార్డులు గదిలో భద్రంగా దాచిపెడతారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ గది సంరక్షణకు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కొద్దిపాటి వర్షమొచ్చినా గది మొత్తం చెరువులా తయారవుతోంది.

త్రుటిలో తప్పిన ప్రమాదం..

శ్లాబ్ పెచ్చులూడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. సోమవారం ఓ పెద్ద పెచ్చు ఊడి విధుల్లో ఉన్న ఉద్యోగి పక్కన పడింది. అదే ఆయన తలపై పడితే ఎంత పెద్ద ప్రమాదం జరిగేదో తెలియని పరిస్థితి. అలాగే మరికొన్ని రికార్డులపై ప్రకటనలకు సంబంధించిన ఫ్లెక్సీలు కప్పి తడిచిపోకుండా కప్పి ఉంచారు. రికార్డుల రూమ్‌లో విషసర్పాలు సైతం ఉన్నాయోమోనని సిబ్బంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులు చేస్తున్నా ఆ శాఖ కార్యాలయంలో రికార్డుల గదిని మాత్రం బాగు చేసుకోలేని పరిస్థితిలో కార్పొరేషన్ శాఖ ఉండటం పట్ల అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకు బాగుచేయడం లేదంటే మున్సిపల్ కార్యాలయమే ఇక్కడ ఉండదని, పూర్తిగా కూలగొట్టి ప్రయివేటు వ్యక్తుల వ్యాపార భవనాలు నిర్మిస్తారనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. మరికొందరు అంచనాలు తయారుచేశారు బాగుచేస్తారని చెబుతుండటం గమనార్హం.



భయం భయంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి



అధ్వానంగా రికార్డులు భద్రపరిచే గది



ఫ్లెక్సీతో రికార్డులు కప్పిన దృశ్యం



అస్తవ్యస్తంగా ఉన్న రికార్డులు

మరమ్మతులు చేయిస్తాం..



కార్పొరేషన్ కార్యాలయం రెండో ఫ్లోర్ పూర్తిగా పాడైపోయింది. తక్షణమే మరమ్మతులు చేయిస్తాం. అందుకు కావాల్సిన అంచనాలు సిద్ధం చేస్తాం. కార్యాలయాన్ని ఇక్కడి నుంచి ఎక్కడికీ తరలించే పరిస్థితి లేదు. పీపీపీ పద్ధతిలో నూతనంగా కార్యాలయం నిర్మించినా మొదటి, రెండవ ఫ్లోర్లు కార్యాలయానికే వాడుతాం. ఈ మేరకు డిజైన్స్ తయారుచేస్తాం.

– పి.వి.వి.డి ప్రసాదరావు, కార్పొరేషన్ కమిషనర్, శ్రీకాకుళం.

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలి



నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

శ్రీకాకుళం: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులుపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలో సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ధనలక్ష్మి, రవికుమార్, సూర్య, ప్రకాష్, శాంతి, కోదండరామయ్య, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు సంతాపం



సంతాపం తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని పార్టీ జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు అన్నారు. శ్రీకాకుళం ఇందిరా విజ్ఞానభవన్‌లో మంగళవారం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ ఆధ్వర్యంలో పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం జమ్మూకాశ్మీర్ ఉగ్రదాడి మృతులకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పేడాడ పరమేశ్వరరావు, కోత మధుసూదన్‌రావు, కొత్తకోట సింహాద్రి నాయుడు, కొత్తకోట లక్ష్మి, డాక్టర్ కవిటి గోపాలకృష్ణ, డి గోవింద మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు కార్మిక దినోత్సవ ర్యాలీ



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): మేడే పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంలోని డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు గురువారం ఉదయం 9.30 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రిమ్స్ కార్మికులతో కలిసి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 20న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కె.రవి, సంతు టి.కుమారి, బి.సూరిడమ్మ, సి.హెచ్.మీనాకుమారి, జి.జి.హెచ్ శానిటేషన్ సిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు



పాట పాడుతున్న విద్యార్థి

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సంఘ సేవకుడు సోడవరపు ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు పాటలు, చిత్రలేఖనం, డ్యాన్స్, ఆటల పోటీలు జరిగాయి. చిన్నారులు హుషారుగా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బి.కుమారరాజ్, డిప్యూటీ గ్రంథాలయాధికారి శంకరరావు, ఉపాధ్యాయులు కె.జె.రాజశేఖర్, గాయకులు నీలిమ, దాత్రి, దేవి, కోమలి, స్నేహాంజలి, నందిని, లోకేష్ సాయి, తనుశ్రీ, యువరాజ్, సిబ్బంది మోహన్, వరలక్ష్మి, సీహెచ్ శివ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా ముందుకుసాగాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. మే 1న నిర్వహించనున్న కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎచ్చెర్లలో మంగళవారం కరపత్రాలు విడుదల చేశారు. నిత్యావసర ధరల పెంపు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోవటం, కార్మికుల హక్కులు కాలరాయడం వంటి అంశాలపై మే 20న నిర్వహించే అఖిలభారత సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, కార్మిక యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ భాషపై పట్టుసాధించాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న బాలరాజు

ఎచ్చెర్ల: లావేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక లిటిల్‌స్కూల్ ప్రిన్సిపాల్, రిసోర్స్ పర్సన్ బి.బాలరాజు మంగళవారం స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరబ్రద్రుడు పాల్గొన్నారు.

కుళాయికి మోటార్లు బిగిస్తే చర్యలు

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో కుళాయిలకు విద్యుత్ మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవని కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటిసారి పట్టుబడితే రూ.2వేలు అపరాధ రుసుం విధిస్తామన్నారు. రీ–కనెక్షన్ కోసం రూ.250 మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండోసారీ పట్టుబడితే మోటారు తొలగించి శాశ్వతంగా కనెక్షన్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.


నృత్య కళాకారుడికి సత్కారం



రామకౌండిన్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ నృత్యోత్సవం సందర్భంగా శ్రీభాష్యం సుందర రామ కౌండిన్యను శివశ్రీ నృత్యనికేతన్ స్థాపకులు రఘుపాత్రుని శ్రీకాంత్ మంగళవారం ఘనంగా సత్కరించారు. నగరంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ విద్యార్థిని సాగరికను కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నృత్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానం అభినందనీయం



రక్తదానం చేస్తున్న విద్యార్థి

ఎచ్చెర్ల క్యాంపస్ : సంత సీతారాంపురం గ్రామంలోని సైకె వ్యవసాయ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 46 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. జిల్లా జీజీహెచ్ రక్త నిధి కేంద్రం సిబ్బంది రక్తం సేకరించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీకావ్య, మేనేజ్‌మెంట్ సభ్యులు బుడుమూరు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాను నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా రూపొందించాలని శ్రీకాకుళం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి కె.సాయి ప్రత్యూష సూచించారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన బూత్ స్థాయి అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దారు ఎస్.గణపతిరావు, ఉప తహసీల్దారు జి.కె. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో మానసిక వికాసం

శ్రీకాకుళం అర్బన్: చదరంగం ద్వారా మెదడు చురుగ్గా పనిచేస్తుందని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం శాఖా గ్రంథాలయంలో పిల్లలకు నీతి కథలు, పుస్తక పఠనం ,చదరంగం పోటీలు నిర్వహించారు.

ఆ మలుపు.. ప్రమాదాలకు పిలుపు



బలగ నుంచి సిద్ధిపేటకు వెళ్లే దారిలో పాత అమ్మ ఫౌండేషన్ కార్యాలయం సమీపంలో మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి వెంబడి వస్తున్న వాహనాలు సైతం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు వద్ద గోడ ఉండటంతో ఏ ప్రమాదం అజాగ్రత్త వహించినా ప్రమాదం తప్పదు.

– శ్రీకాకుళం రూరల్

ఇసుక పొరలుతో ఇక్కట్లు



ఎచ్చెర్ల మండలం కింతలిమిల్లు నుంచి చిలకపాలెం వరకు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఇసుక పొరలు పేరుకుపోతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనచోదకులు స్కిడ్ అవుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఘనంగా అయ్యప్ప ఆలయ ప్రతిష్టాపన పూజలు



ప్రతిష్టాపన పూజలు చేస్తున్న రుత్వికులు

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్పస్వామి దేవాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మహాకుంభాభిషేక విమాన కలశ ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ త్రయాహ్నిక యాగ మహోత్సవాలలో భాగంగా మంగళవారం సుదర్శన హోమం జరిగింది. శబరిమల మేల్ శాంతి ఎం.ఎస్.రాజేష్‌కుమార్ నంబూద్రి, ఆలయ అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ అర్చకులు దేవరకొండ మణిదీపక్ శర్మ, కిరణ్‌కుమార్‌శర్మ, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి చిరంజీవులు, దానేటి రాజారావు, భక్తులు పాల్గొన్నారు. 30న అక్షయ తృతీయ సందర్భంగా మహా కుంభాభిషేకాలు, ధ్వజ స్థంభ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

సాగునీరు అందించాలని ధర్నా



రామజోగిపేటలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

ఎచ్చెర్ల: పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి శివారు భూముల వరకూ సాగునీరు అందించాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. తోటపాలేం, కొత్తపేట, శెగిడిపేట, అంబేద్కర్‌నగర్, రుప్పపేట, రామజోగిపేట గ్రామాల్లో జిల్లా రైతు సంఘం, కౌలురైతు సంఘం, నారాయణపురం కుడికాలువ శివారు ప్రాంత రైతు ప్రతినిధులు వెలమల రమణ, అల్లు సూర్యనారాయణ, అరసవల్లి రామారావులు మంగళవారం పర్యటించారు. సాగు నీటి కోసం వచ్చే నెల 7న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్ ప్రాజెక్ట్‌ల పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మే 2న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ముర్రపు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పూడివలస పెట్రోల్ బంక్ వద్ద ఉదయం 7 గంటలకు రైతు చైతన్య జీపుజాతా ప్రారంభిస్తారని తెలిపారు.

క్యాన్సర్ బాధితుడికి సాయం



నిత్యావసర సరుకులు అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్ కుమార్ లివర్ క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులకు డాక్టర్ హర్ష చారిటబుల్ ట్రస్టు సభ్యులు డోకి శ్రావణ్‌కుమార్ నిత్యావసర సరుకులను అందించి ఆదుకున్నారు. మూడునెలలకు సరిపడా వస్తువులు, బియ్యం ప్యాకెట్, ప్రోటీన్ బాక్సులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిక్కు అప్పన్న, ఉర్లం శివతేజ, నంది ఉమాశంకర్, బి.జగదీష్, బొట్టా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధర్నా



దీక్ష చేపడుతున్న ఎన్ఎంయూ నాయకులు, ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు తక్షణమే 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య, నాయకులు పి.నవీన్‌బాబు, బీఎస్ రావులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా రెండో రోజైన మంగళవారం కూడా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శిబిరాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా గానీ, సంస్థ ద్వారా గానీ కొనుగోలు చేయాలని, 114 జీవోలో పొందుపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400 వరకు చెల్లింపులు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలని, డిప్యుటేషన్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు ఎ.పార్వతి, ఎం.రేవతి, ఎం.జ్యోత్స్న, ఎస్.రమణమ్మ, ఎల్ఎస్.రావు, పీఎస్ఎస్‌రావు, ఎస్.యూ.రావు, సీహెచ్‌జె రావు, వీఎస్ఎం రావు, ఎల్ఎస్ నారాయణ, జె.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

శ్రీకాకుళం: ఆత్మరక్షణ కోసం క్రీడలు దోహదపడతాయని తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను అన్నారు. శ్రీకాకుళం టౌన్‌హాల్‌లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం క్రీడలు నిర్వహిస్తామన్నారు.